క్లుప్తంగా

బహుళ పంటల సాగును సద్వినియోగం చేసుకోండి



కదరంపల్లి వద్ద బీడుభూమిలో విత్తనాలు నాటుతున్న రైతులు

కుందుర్పి: మండలంలో ఏపీ సీఎన్ఎఫ్ సంస్థ పర్యవేక్షణలో చేపడుతున్న బహుళ పంటల సాగును రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ మహేష్, ఆశాఖ కోఆర్డినేటర్ శివశంకర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మహంతపురం, మలయనూరు పంచాయతీల్లో బహుళ పంటలకు సంబంధించి ఉలవ, రాగి, అలసంద, పెసర తదితర విత్తనాలను రైతుల సమక్షంలో వర్షాధార పంటగా సాగు చేయించారు. విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీతో అందజేస్తోందని అధికారులు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

ఉరవకొండ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని, మొక్కలను నాటడమే కాకుండా వాటిని పరిరక్షించే బాధ్యతను తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ వైస్ చైర్మన్ డాక్టర్ భాస్కర్‌నాయుడు పిలుపు నిచ్చారు. బుధవారం స్థానిక మహాత్మ జూనియర్, డిగ్రీ కళాశాలలు, ఉషోదయ స్కూల్ సంయుక్తంగా 'పర్యావరణ పరిరక్షణ' అనే అంశంపై సెమినార్ ఏర్పాటు చేశారు. ఈసెమినార్‌కు జాతీయ మానవ హక్కుల కమిషన్ వైస్ చైర్మన్, జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగమల్లి ఓబుళేసులు హాజరయ్యారు. కార్యక్రమంలో మహాత్మ కళాశాల ఏఓ కేకే ప్రసాద్, ప్రిన్సిపాల్ బసవరాజు, ఉషోదయ స్కూల్ ఏఓ జయప్రకాష్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హనుమన్న పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతుకు తీవ్రగాయాలు



శెట్టూరు ఫారెస్ట్‌లో బోల్తా పడిన వాహనం

శెట్టూరు: మండల కేంద్రం పరిధిలోని ఫారెస్ట్‌లో పత్తితో వెళుతున్న బొలెరో వాహనం బోల్తాపడటంతో రైతుకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. అడవిగొల్లపల్లికి చెందిన రైతు నాగరాజు, తాను పండించిన పత్తి పంటను బొలెరో వాహనంలో వేసుకుని చిత్రదుర్గం బయలుదేరాడు. శెట్టూరు ఫారెస్ట్‌లోకి రాగానే వాహనం అదుపుతప్పి రోడ్డుపై అడ్డంగా బోల్తాపడింది. వాహనంపై కూర్చున్న రైతు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే వాహనంలో ఉన్న వారు రైతును కళ్యాణదుర్గం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్ఐ యువరాజు కేసు నమోదు చేశారు.

వైభవంగా గ్రామోత్సవం



గోపాలకృష్ణ విగ్రహాల గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: స్థానిక బళ్లారి బైపాస్‌లోని దేవాంగ ఫంక్షన్ హాలు సమీపంలోని గోపాల కృష్ణ ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించనున్న మహాగణపతి సహిత గోపాల కృష్ణ విగ్రహాల గ్రామోత్సవం బుధవారం నిర్వహించారు. స్థానిక గోపాల్ కృష్ణ ఆలయానికి మహిళలు పవిత్ర గంగా జలాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి నూతన విగ్రహాలకు అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో నూతన విగ్రహాలను ఉంచి మేళాతాళలతో పట్టణ పురవీధుల్లో గ్రామోత్సవం చేశారు.

సామూహిక సత్యనారాయణ వ్రతం



కూడేరు: రామాలయంలో సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్న దృశ్యం

కూడేరు: కూడేరులోని రామాలయంలో బుధవారం పౌర్ణమిని పురస్కరించుకొని సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. సత్యనారాయణ వ్రత ప్రాముఖ్యతను పురోహితులు నారాయణ శాస్త్రి వివరించగా, ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆలకించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పురుషోత్తం, బొజ్జన్న యాదవ్, హరినాథ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి



కమిషనర్ దివాకర్‌రెడ్డికి రాఖీ కడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్ప, కౌన్సిలర్లు



ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డికి రాఖీ కడుతున్న మహిళలు

కళ్యాణదుర్గం: నియోజకవర్గ వ్యాప్తంగా బుధవారం రాఖీ పౌర్ణమి ఘనంగా జరిగింది. ఈశ్వరీయ బ్రహ్మకుమారి విశ్వ విద్యాలయం నిర్వాహకులు కమలాక్షి సిస్టర్ స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ నిశాంత్ రెడ్డికి రాఖీ కట్టి సోదర భావాన్ని చాటుకున్నారు. రెవెన్యూ కార్యాలయం, పోలీసు స్టేషన్‌తో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులకు రాఖీలు కట్టి స్వీట్లు పంచిపెట్టారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని సరస్వతీ విద్యా మందిరంలోని రాఖీ పౌర్ణమి బుధవారం ఘనంగా జరిగింది. బీజేపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ ముప్పూరి దేవరాజు, గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు రాఖీ పౌర్ణమి ప్రాముఖ్యతను తెలియజేశారు. విద్యార్థులకు రాఖీలు కట్టారు. సమితి కార్యదర్శి రంగనాథశర్మ, కరణం తిరుమలరావు పాల్గొన్నారు.

రాయదుర్గం/రాయదుర్గంటౌన్: రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మలందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రక్షణ కవచంగా నిలిచారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి కొనియడారు. బుధవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా మహిళలందరికీ విప్ కాపు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని విప్ స్వగృహం వద్ద ఆడపడుచులు, మెప్మా ఆర్పీలు భారీగా తరలివచ్చి విప్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ కట్టి అప్యాయత చూపిన అక్కచెల్లమ్మలకు రుణపడి ఉంటామని విప్ కాపు, ఆయన సతీమణి కాపు భారతి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అధికారులు, కౌన్సిలర్లకు రాఖీ కట్టి శుభకాంక్షలు తెలియజేశారు. అలాగే ఈశ్వరీయ ప్రజాపిత బ్రహ్మకుమారీలు పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులకు యోగీశ్వరి ఆధ్వర్యంలో రాఖీ కట్టారు. అలాగే పట్టణంలోని మెప్మా, వార్డు కౌన్సిలర్లు, మహిళా ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ మహిళా నాయకురాళ్లు, అధికారులు విప్ రామచంద్రారెడ్డికి రాఖీ కట్టి రక్షబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మెప్మా పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు పార్వతి, కౌన్సిలర్ శ్రీలక్ష్మి, మెప్మా టీపీఓ నారాయణరెడ్డి, సీవోలు సంధ్య, కిరణ్మయి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓ నిశాంత్‌రెడ్డికి రాఖీ కడుతున్న సిస్టర్ కమలాక్షి

మౌలిక వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ నారాయణరెడ్డి

కూడేరు: మౌలిక వసతుల కల్పనకు హెచ్‌డీఎస్ (ఆస్పత్రి అభివృద్ధి స్కీం) నిధులతో ప్రాధాన్యత ఇవ్వాలని కూడేరు పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ నారాయణరెడ్డి కోరారు. బుధవారం పీహెచ్‌సీలో హెచ్‌డీఎస్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ మాట్లాడుతూ బోరు, మోటార్ ఉన్నా పైపులైన్ చేయించకుండా నిర్లక్ష్యం చేస్తే ఎలా అని సిబ్బందిని ప్రశ్నించారు. నీటి సౌకర్యం లేకపోతే గర్భిణులు, రోగులు, సిబ్బంది ఇబ్బంది పడతారన్నారు. సర్పంచ్ లలితమ్మ, వైద్యాధికారిణి సరిత, సీహెచ్‌ఓ వరలక్ష్మీ ఉన్నారు.

కరిబసవ రాజేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవం



పీఠాధిపతుల విగ్రహానికి పూజలు చేస్తున్న దృశ్యం

ఉరవకొండ: ఉరవకొండ గవిమఠం ఏడో పీఠాధిపతి కరిబసవరాజేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ 20వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఏడో పీఠాధిపతి కరిబసవరాజేంద్రస్వామి విగ్రహానికి పూల మాల వేసి, విగ్రహ అడహక్ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అడహక్ కమిటీ సభ్యులు ఈడిగ గోపాల్, లక్ష్మీకాంత్ మాట్లాడుతూ గవిమఠం ఏడో పీఠాధిపతి కరిబసవ రాజేంద్రస్వామి హయాంలో చేసిన సేవలు మరువలేనివన్నారు. గవిమఠానికి చెందిన వందల ఎకరాల భూమిని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, వైద్యశాలలు, కార్యాలయాలు నిర్మించుకోవడానికి దానం చేశారన్నారు. హెచ్‌ఎం వీరన్న ఉన్నారు.

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు



పథకాల బ్రోచర్ అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

కణేకల్లు: సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపాయని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. పిల్లల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలనే ఆకాంక్షతో 'అమ్మఒడి', 'జగనన్న విద్యాదీవెన', 'వసతి దీవెన', 'విదేశీవిద్య', 'వైఎస్సార్ చేయూత', 'వైఎస్సార్ ఆసరా' 'చేనేత నేస్తం', జగనన్నతోడు, పేదలందరికీ ఇళ్లు ఇలా ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారన్నారు. మండలంలోని పులచెర్ల గ్రామంలో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు బోయ రవి, రవి ప్రకాష్‌రెడ్డి, బషీర్, రవిచంద్ర ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విప్ కాపు ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్ల కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్లను అందజేశారు. మీ అందరికీ మంచి చేసిన జగనన్నకు మీరు తోడుగా ఉండి మరోమారు సీఎంగా గెలుపించాలని కోరారు. ఐదేళ్లు అధికారంలో ఉన్న చంద్రబాబు నాయుడు, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అతని అనుచరులు అడ్డగోలుగా దోచుకొన్నారని ఆరోపించారు. ఏనాడూ ప్రజల గురించి పట్టించుకున్న పాపనలేదన్నారు. అధికారంలో ఉండి మేలు ఎవరు చేశారో? మోసం ఎవరూ చేశారో ఒక్కసారి ఆలోచించుకోవాలన్నారు.
ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీపీ హెచ్.సంధ్య, ఎంపీటీసీ గంగమ్మ, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్ రెడ్డి, గోపులాపురం సర్పంచు ప్రకాష్‌చౌదరి, కణేకల్లు పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ టీ.కేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బోయ నాగరాజు, ధనుంజయ్యరెడ్డి, హంపీ, యంత్రకాయల వన్నూరప్ప, కెనిగుంట రామిరెడ్డి, అంబాపురం భాస్కర్‌రెడ్డి, పుల్లంపల్లి పెద్దిరెడ్డి, దూదేకుల మహమ్మద్, ఆలేరి లక్ష్మీకాంతరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, హనుమంతరావు, సాధత్, సర్మస్, ఖలందర్ తదితరులు పాల్గొన్నారు.

'ఓటు అడిగే హక్కు మనకే ఉంది'

రాయదుర్గం: ప్రజల వద్దకెళ్లి ఓటు అడిగే నైతిక హక్కు వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఉందని, గడిచిన నాలుగేళ్లలో మన ప్రభుత్వం చేసిన మేలును ఇంటింటికీ వెళ్లి ధైర్యంగా, సగర్వంగా చెప్పుకునే అవకాశం కూడా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మనకే కల్పించారని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. పట్టణ సమీపంలోని మద్దానేశ్వర ఆలయం ముందు వైఎస్సార్ విగ్రహం చుట్టూ రూ.8 లక్షల వ్యయంతో ప్రహరీ నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. అనంతరం విలేకర్లతో విప్ కాపు మాట్లాడారు.. రాష్ట్రానికి పట్టిన అష్టదరిద్రులు ఎవరైనా ఉన్నారంటే అది టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, పుత్రుడు లోకేష్, రాయదుర్గంలో మురికి కాలువ అని విరుచుకుపడ్డారు. 2019 ఎన్నికల తర్వాత వరుస ఓటములతో వెంటిలేటర్‌పై ఉండే టీడీపీని గ్లాసుతో ఎన్ని నీళ్లు పోసినా పైకి లేవడం సాధ్యం కాదనే విషయం దత్తపుత్రుడైన పవన్‌కు తెలిసిరాలేదన్నారు. ఈ గజ దొంగల ముఠాకు 2024 ఎన్నికలే ఆఖరివి కాబోతున్నాయని జోస్యం చెప్పారు. ఆ తర్వాత ప్రజలే బంగాళాఖాతంలో కలిపేస్తారన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ 14 ఏళ్ల సీఎం నని చెప్పుకునే చంద్రబాబు కు ఒక్క స్కీమ్ కూడా చెప్పుకోవడానికి లేవన్నారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా డీబీటీ పద్ధతిలో నేరుగా రూ.1.65 లక్షల కోట్లు పేదల ఖాతాలకు చేర్చిన ఏకైక ప్రభుత్వం కూడా మనదేనని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ విద్యావతి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాదవరెడ్డి, పార్టీ ముఖ్య నాయకుడు బోర్‌వెల్ నాగిరెడ్డి, కాంట్రాక్టర్ సత్యనారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఆవులదట్ల నారాయణ నాయక్, సర్పంచులు బొజ్జి, ఎర్రిస్వామిరెడ్డి, నాయకులు ఉడేగోళం గోవిందప్ప, శివారెడ్డి, ఉలిగప్ప, అమరేష్, వాల్మీకి పవన్ పాల్గొన్నారు.

నేడు పులచెర్లలో గడప గడపకూ మన ప్రభుత్వం

పులచెర్ల గ్రామంలోగురువారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు రవిప్రకాష్‌రెడ్డి, బషీర్, రవి చంద్ర ఓ ప్రకటనలో తెలిపారు.

విద్య, వైద్యరంగాలకు ప్రాధాన్యత



మాట్లాడుతున్న జెడ్పీటీసీ నాగరాజు

కంబదూరు: ప్రభుత్వం విద్య, వైద్యరంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, అధికారులు బాగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ భీమేష్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు ఆయా శాఖల ప్రగతిని చదివి వినిపించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలను అధికారులు సమన్వయంతో ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సమావేశానికి గైర్హజరైన అధికారులకు నోటీసులను ఇవ్వాలని ఆయన ఆదేశించారు. ప్రతి అధికారి బాధ్యతగా విధులు నిర్వర్తించాలని కోరారు. ఎంపీడీఓ సుధాకర్ రాజు, ఎస్ఐ రాజేష్, సీడీపీఓ వనజ అక్కమ్మ, వైద్యాధికారి ఆసియ,డీటీ నారాయణస్వామి పాల్గొన్నారు

నాణ్యతగా సీసీరోడ్డు నిర్మాణం

బ్రహ్మసముద్రం: సీసీరోడ్డు నిర్మాణం నాణ్యతగా చేపట్టాలని పీఆర్ జేఈ విజయకృష్ణ, సర్పంచు శెట్టిగారి మంజునాథ కాంట్రాక్టర్‌కు సూచించారు. గడప గడపకూ కార్యక్రమం నిధులు రూ.5 లక్షలతో భైరవానితిప్ప పంచాయతీలో చేపడుతున్న సీసీరోడ్డు పనులను బుధవారం పరిశీలించారు.

బాధిత రైతులను ఆదుకుంటాం



జల్లిపల్లిలో కందికి అందిస్తున్న రక్షక తడిని పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

కూడేరు: వర్షాభావంతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామని కలెక్టర్ గౌతమి తెలిపారు. బుధవారం ఆమె కూడేరు మండలంలో పర్యటించారు. తొలుత ముద్దలాపురం వద్ద ఆర్డీటీ ఆధ్వర్యంలో ఏర్పాటైన రైతు నేస్తం ఫుడ్ ప్రొడ్యూసర్ కంపెనీని సందర్శించారు. అక్కడ ఉత్పత్తి చేసే స్నాక్స్, ఆహార పదార్థాల గురించి ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ మల్లా రెడ్డి వివరించారు. చిక్కీలు, ఇతర స్నాక్స్ గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు పంపిణీ చేసేందుకు కొనుగోలు చేసేలా కృషి చేస్తానని కలెక్టర్ భరోసా ఇచ్చారు. తర్వాత అదే గ్రామంలో కొనసాగుతున్న పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం నగరానికి తాగు నీటిని సరఫరా చేసే వైఎస్ రాజశేఖర్ రెడ్డి మంచి నీటి అభివృద్ధి పథకాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి జల్లిపల్లిలో కౌలు రైతు రామాంజనమ్మ పొలంలో కొర్ర పంట, మల్లికార్జున, వెంకటరెడ్డి పొలాలను పరిశీలించారు. అనంతరం రైతులు ఆమెను కలిసి వ్యవసాయ మోటార్లకు లోఓల్టేజీతో విద్యుత్ సరఫరా అవుతోందని, దీంతో పంటలకు నీరు సక్రమంగా అందించలేకపోతున్నామని వాపోయారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా వర్షాధారం కింద సుమారు 2.40 లక్షల హెక్టార్లలో పంటలు సాగైనట్లు తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునేందుకు 80 శాతం సబ్సిడీతో కొర్రలు, ఉలవలు, రాగి, అలసందలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎంపీపీ నారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ సుబ్బమ్మ, సర్పంచ్ ధనుంజయ్య, డీపీఓ ఉమామహేశ్వరమ్మ, ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్, జిల్లా హార్టికల్చర్ అధికారి హరినాథ్ రెడ్డి, ఆర్డీఓ మధుసూదన్, ఏడీఏ రవి, తహసీల్దార్ శేషారెడ్డి, ఎంపీడీఓ ఎంకే బాషా, ఏఓ విజయ కుమార్ పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

ఉరవకొండ: ఎస్‌కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నియోజకవర్గ స్థాయి పీడీ, పీఈటీల స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. వ్యాయమ సంఘం జిల్లా అధ్యక్షుడు అక్కులప్ప, కార్యదర్శి సత్యనారాయణ, రాష్ట్ర పీఈటీ, పీడీల సంఘం కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారానికి కృషి చేయండి

- మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

విడపనకల్లు: గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజలు తెలిపిన సమస్యలను ప్రణాళికతో పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వర రెడ్డి ఆదేశించారు. బుధవారం ఉండబండలో మండలంలోని అన్నీ శాఖాధికారులు, సచివాలయ సిబ్బందికి మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి రివ్యూ మీటింగ్ నిర్వహించారు. పాల్తూరు, హావళిగి గ్రామాల్లో ఉన్న ఐదు సచివాలయాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను ఎంత వరకు పూర్తి చేశారని ఎంపీడీఓ, ఆర్‌డబ్ల్యూఎస్, ఎలక్ట్రికల్, వ్యవసాయ తదితర శాఖల అధికారులతో పాటు సచివాలయ సిబ్బందిని, అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేసిందన్నారు.

ఎప్పటికప్పుడు పరిష్కారం చూపండి...

గ్రామాలో ప్రజలు తెలిపిన ప్రతి సమస్యనూ పరిష్కరించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలనికి రూ.20 లక్షల చొప్పున ప్రత్యేక నిధులు మంజూరు చేశారని విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ప్రధానంగా ప్రజలకు తాగునీరు, విద్యుత్, వీధిలైట్లు, కాలనీలో రోడ్లు ఇలా అనేక సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకొని, ముందుకు సాగాలన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారంలో అలసత్వం నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జెడ్పీటీసీ హనుమంతు, ఎంపీపీ పుష్పావతి, జేసీఎస్ కన్వీనర్ భరత్‌రెడ్డి, మాజీ సర్పంచు భీంరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోండి



సమస్యలను ప్రస్తావిస్తున్న కౌన్సిలర్లు గోవిందరాజులు, నాగవేణి

రాయదుర్గంటౌన్: ప్రజా సమస్యల పరిష్కారమే కౌన్సిల్ లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అన్నారు. బుధవారం కౌన్సిల్ హాల్‌లో సాధారణ సమావేశం జరిగింది. అజెండాలోని అంశాలను చదివి వినిపించారు. అనంతరం కౌన్సిలర్లు గోవిందరాజులు, బండి అజయ్ ఏపీ ట్రాన్స్‌కో బకాయిలు, ఈఈఎస్ఎల్ బకాయిలపై సందేహాలను అధికారుల దృష్టికి తెచ్చారు. 15వ ఆర్థిక సంఘం కింద విడుదలయ్యే నిధులను ముస్ముందు బకాయిలకు చెల్లిస్తే అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. దీనిపై పునరాలోచించుకోవాలని సూచించారు. 19వ వార్డు కౌన్సిలర్ శారదమ్మ మాట్లాడుతూ పట్టణంలో దోమల బెడద అధికంగా ఉందని, ఫాగింగ్ యంత్రాలను పెంచాలన్నారు. కౌన్సిలర్ గోవిందరాజులు మాట్లాడుతూ పట్టణంలో కుక్కలు, పశువుల బెడద అధికంగా ఉందన్నారు. కుక్కలు గుంపులుగుంపులుగా ప్రతి వార్డుల్లో సంచరిస్తున్నట్లు చెప్పారు. 1వ వార్డు కౌన్సిలర్ నాగవేణి మాట్లాడుతూ వార్డు పరిధిలోని ప్రభుత్వ స్థలం కబ్జా కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కౌన్సిలర్ డిష్‌గోవిందు మాట్లాడుతూ శాంతినగర్ వైఎస్సార్ విగ్రహం వద్ద ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరారు.

టీడీపీ కౌన్సిలర్ అనవసర రచ్చ

ప్రతిసారి ఏదో ఒక అనవసర అంశాన్ని తెరపైకి తెచ్చి రచ్చ చేయడమే పనిగా 3వ వార్డు టీడీపీ కౌన్సిలర్ ప్రశాంతి తీరు ఉందని కౌన్సిలర్ పొరాళ్ల గోవిందరాజులు తప్పుబట్టారు. ఇటీవల కౌన్సిల్ హాల్‌లో మెప్మా ఆర్పీలతో మెప్మా జిల్లా పీడీతో పాటు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి జగనన్న మహిళా మార్ట్ ఏర్పాటుపై అధికారిక సమావేశం నిర్వహించారు. కౌన్సిల్ హాల్‌లో ఆర్పీలతో సమావేశాన్ని ఏ విధంగా నిర్వహిస్తారని అధికారులను కౌన్సిలర్ ప్రశాంతి బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో లేవనెత్తి రచ్చకు దారి తీసింది.వైస్ చైర్మెన్లు శ్రీనివాసయాదవ్, వలిబాషా ఉన్నారు.

ఉద్దేహాళ్‌లో ఆక్రమణల తొలగింపు



ఈనాడు విలేకరి వెంకటేష్‌కు సంబంధించిన బాత్‌రూమ్‌ను తొలగిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్‌లో భారీ పోలీస్ బందోబస్తు నడుమ రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో బుధవారం ఆక్రమణలు తొలగించారు. 2017లో హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఆక్రమణల తొలగింపునకు ఆదేశాలు ఇవ్వడంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఈఓపీఆర్డీ విజయమ్మ, పంచాయతీ కార్యదర్శి శివన్న, వీఆర్ఓ యుగేంధర్ పోలీస్ బందోబస్తు మధ్య ఆక్రమణలో ఉన్న బంకులు, భవనాలను ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకూ తొలగించారు. మీనాక్షి, కురుబ రామప్ప, కురుబ రుద్రన్న, రాజేంద్రరావు, పెద్ద ఎర్రిస్వామి, చత్రపతి నాయక్, కురుబ చంద్రశేఖర్, కురుబ నాగేంద్ర, రోజావతి ఆక్రమణలను సర్వే చేసి తొలగించేందుకు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిన్నట్లు ఈఓపీఆర్‌డీ విజయమ్మ తెలిపారు. ఆక్రమణలో ఉన్నట్లు సర్వే చేయకుండా ఎక్కడ వరకూ తొలగిస్తారని చత్రపతి, పెద్ద ఎర్రిస్వామి వాదనకు దిగారు. గ్రామ కంఠం ప్రకారం ఆక్రమణలో ఉన్నట్లు నిర్ధారణ కావడంతో జేసీబీతో వారి రూములను తొలగించారు. ఇదిలా ఉండగా ఈనాడు రిపోర్టర్ వెంకటేశులు భార్య రోజావతి కోర్టు ఇంజక్షన్ ఆర్డర్లు తమకు ఇచ్చిందని బాత్‌రూమ్ తొలగించవద్దని అడ్డుతగిలారు. పోలీసులు వారిని అడ్డుకుని జేసీబీతో బాత్‌రూమ్‌లను తొలగించారు. కార్యక్రమంలో రాయదుర్గం పట్టణ, రూరల్, కళ్యాణదుర్గం రూరల్ సీఐలు లక్ష్మన్న, యుగంధర్, శ్రీనివాసులు, బొమ్మనహాళ్, గుమ్మఘట్ట, డి.హీరేహాళ్ ఎస్ఐలు శివ, సునీత, రంగడు, ఏఎస్ఐ రమాణ, హెడ్ కానిస్టేబుళ్లతో పాటు భారీ స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

బెడిసి కొట్టిన 'కాలవ' కుతంత్రం

బొమ్మనహాళ్: మాజీ మంత్రి కాలవ శ్రీనివాసుల రాజకీయ కుతంత్రం బెడిసి కొట్టింది. కాలవ ముఖ్య అనుచరుడైన బొమ్మనహాళ్ మండల ఈనాడు విలేకరి వెంకటేశులు అప్పటి టీడీపీ ప్రభుత్వం, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అండదండలతో రస్తాను ఆక్రమించి మరుగుదొడ్లు, రేకుల షెడ్లు నిర్మించుకున్న విషయం తెలిసిందే. జూలై 22వ తేదీన గ్రామస్తులంతా ఏకమై పార్టీలకు అతీతంగా రస్తాను ఆక్రమించిన విలేకరి రేకుల బంకులను తొలగించారు. మరుగుదొడ్లను తొలగించమంటే మూడు రోజుల్లో తొలగిస్తామని వెంకటేశుల కుటుంబ సభ్యులు చెప్పుకొచ్చారు. అయితే వాటిని తొలగించకుండా ఈనాడు పేపర్‌లో తనకు అనుకులమైన వార్తలు, తప్పుడు వార్తలను రాసుకుంటూ వచ్చారు. ఈ విషయంపై గ్రామస్తులంతా కలసి కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు కూడా చేశారు. ఇది కాక రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డిపై గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంపై వార్తలు రాసినందుకే తనపై కక్షకట్టి రేకుల బంకులను తొలగించారంటూ టీడీపీ నాయకులతో మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, ఈనాడు వెంకటేశులు తప్పుడు ప్రచారం కూడా చేయించారు. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఉద్దేహాళ్ గ్రామానికి వచ్చి ఈనాడు వెంకటేశులకు అనుకులంగా మాట్లాడితే ప్రజలు ఎక్కడ నిలదీస్తారనే భయంతో రాలేదని గ్రామస్తులు చెబుతున్నారు.

సంక్షిప్త సమాచారం

పొలం బడులతో అవగాహన

శెట్టూరు: పొలంబడుల నిర్వహణతో రైతులకు శాస్త్రీయ వ్యవసాయంపై అవగాహన కలుగుతుందని డీడీఏ మద్దిలేటి అన్నారు. వ్యవసాయ అధికారులు, కళ్యాణదుర్గం కేవీకే శాస్త్రవేత్తలు బుధవారం అయ్యగార్లపల్లిలోని రైతు మల్లయ్య పొలంలో మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొలం పరిసరాల విశ్లేషణ, ఆకు కత్తిరింపు, బృందవిన్యాసాలు చేపట్టారు. ప్రయోగశాల ప్లాటులో జిప్సం వేయడం, బెట్ట పరిస్థితిలో వేరుశనగకు పొటాషియం నైట్రేట్ వాడకంపై అవగాహన కల్పించారు. ఏడీఏలు శైలజ, యల్లప్ప, ఏఓ సంధ్యాకుమారి, కేవీకే శాస్త్రవేత్తలు యుగంధర, మల్లికార్జున, అరవింద్, రైతులు పాల్గొన్నారు.

విజేత మండల సమాఖ్య అధ్యక్షురాలిగా వసంత

కూడేరు: కూడేరు గ్రామ డ్వాక్రా సంఘాల అధ్యక్షులు విజేత మండల సమాఖ్య నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. స్థానిక వైకేపీ కార్యాలయంలో డ్వాక్రా సంఘాల మండల సర్వసభ్య సమావేశం జరిగింది. అధ్యక్షురాలుగా కలగళ్లకు చెందిన దివ్యా గ్రామైక్య అధ్యక్షురాలు వసంత, ఉపాధ్యక్షురాలుగా ఉదిరిపికొండకు చెందిన పద్మావతి, కార్యదర్శిగా కూడేరు సురేఖ, కోశాధికారిగా కొర్రకోడు సౌజన్య, జాయింట్ సెక్రటరీగా మారుతమ్మ ఎంపకయ్యారు. ఈ కమిటీ రెండేళ్ల పాటు ఉంటుందని ఏపీఎం రాజశేఖర్ తెలిపారు.

బొలెరో, లారీ ఢీ

గుమ్మఘట్ట: మండలంలోని దేవరెడ్డిపల్లి గేటు వద్ద ఐరన్ లారీ, బొలెరో వాహనం బుధవారం ఢీకొన్నాయి. ఈ ఘటనలో డ్రైవర్ రుద్రయ్య తీవ్ర గాయాల పాలయ్యాడు. వివరాలు.. గుమ్మఘట్ట మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన రుద్రయ్య తన బొలెరో వాహనంలో టమాట లోడుతో అనంతపురానికి వెళ్లిడు. తిరిగి వస్తుండగా మార్గమధ్యంలోని దేవరెడ్డిపల్లి వద్దకు రాగానే రాయదుర్గం వైపు నుంచి హిందూపురానికి వెళుతున్న ఐరన్ లారీని ఢీకొట్టాడు. రుద్రయ్యకు తీవ్ర రక్తగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ శశికుమార్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రీవెరిఫికేషన్ సక్రమంగా చేపట్టండి

బొమ్మనహాళ్: మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో తొలగింపు అయిన ఓటరు జాబితాలను రీవెరిఫికేషన్ చేయాలని ఈఆర్ఓ జి.శంకరయ్య తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి కల్యాణ మంటపంలో తహసీల్దార్ ఓబుళేసు, డీటీ మునీంద్ర, హుస్సేన్ పీరాతో కలసి ఈఆర్ఓ బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈఆర్ఓ మాట్లాడుతూ 2022 జనవరి 6 నుంచి 2023 మార్చి 31 వరకు, 1 ఏప్రిల్ 2023 నుంచి 9 ఆగస్టు 2023 వరకు గల మధ్య కాలంలో ఓటరు లిస్టుపై రీవెరిఫికేషన్ చేయాలని కలెక్టర్ ఆదేశించారన్నారు.